కథా కౌముది

# "డోరియన్ - దూరియాన్"

నిర్మలాదిత్య {భాస్కర్ పులికల్, Tampa, FL}

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

ఎప్పుడొచ్చారు? హౌ వాజ్ యూర్ డే? ఈ కథ మీకు నేను చెప్పాల్సిందే. ఇదిగో ఇప్పుడే మా చెల్లితో కూడా వాట్సాప్ లో విడియో చాట్ చేస్తూ ఇదేకథ చెప్పా. ఇట్ టుక్ హర్ బై సర్ప్రైజ్. ఆశ్చర్యపడింది తను. ఆశ్చర్య పడాల్సిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయనుకోండి. వచ్చిన కొత్తలో ఇంటర్నేషనల్ కాల్ అంటే వారానికి ఓ సారి ఫోన్లో, ఆచి తూచీ ఓ కన్ను గడియారం ముళ్ళు మీద పెట్టి మరీ మాట్లాడేవాళ్ళం. అవతలి వారు కాల్ కోసం ఎదురుచూస్తుండేవారు. ఇప్పుడు అనుకున్న తరువాయే మాట్లాడొచ్చు. అవతలి వారు పనిలో ఉన్నాం కొంత సేపు తరువాత చేయండి, అని అనగలిగినంత సులభంగా. కానీ మా చెల్లి సంగతి తెలుసు కదా. ఎప్పుడూ ఫోన్ చేసినా గంటల తరబడి మాట్లాడుతూనే ఉంటుంది. చిన్నప్పుడే మమ్మల్నిద్దరిని వస పిట్టలు అనేవారు. మరి మనుష్యులు, అపాయింట్మెంట్ తప్పితే దొరకని ఈ దేశంలో, ఎదురుగా కనిపించారంటే , నేను మాట్లాడకుండా ఉండిపోవడమే. మీకింకేమి ఆప్షన్ లేదు నా కథ వినాల్సిందే.

పోయిన సారి ఇర్మా తూఫాన్ వచ్చి నప్పుడు పడిన అగచాట్లతో జనాలు, ఈ సారి డోరియన్ తుఫాన్ వస్తున్నదని విన్న వెంటనే బాగా అప్రమత్తం అయ్యినట్లున్నారు. పోయినసారి లాగా, ఈ సారి హడావిడులేమి కనపడలేదు. గ్యాస్ అన్ని స్టేషన్ల లోను దొరుకుతున్నాయి. గ్రోసరీ స్టోర్ల పైన దండయాత్రలులేవు. నిత్యావసరాలు దొరుకుతూనే ఉన్నాయి. దానికితోడు డోరియన్ సముద్రం పైనే, మనుష్యులకు, తీరప్రాంతంకుకొంత దూరం గానే తన రహదారి వెదుక్కుంది కదండి. జనము ఊపిరి పీల్చుకుని, తిరిగి తమ గానుగ జీవిత దినచర్యలపై పడడానికి పెద్ద గ్యాప్ ఏమి కనపడలేదు. తుఫాను వల్ల కాదు కానీ, నిన్నరాత్రి నిద్ర పట్టలేదు. ఇది నాకప్పుడప్పుడు వస్తున్న సమస్యే. మొదట్లో కష్టమనిపించినా, ఇప్పుడు అలవాటైపోయింది కదా, చప్పుడు కాకుండ లేచి కిందకు వెళ్లి కారు తీసి వాల్మార్ట్ స్టోర్ కి వెళ్ళా. స్టోర్ 24 గంటలు తెరిచి ఉండడం నా లాంటి వారికి ఓ ఉపశమనమే. దేదీప్తమాన్యంగా వెలుగుతున్న దీపాలతో, దిగాలు పడుతున్న రాత్రిని , కాంతులు విరాజిమ్ముతున్న దినంగా మార్చేస్తున్నది. అలా స్టోర్ లో పోయి పచార్లు చేయడం మొదలెట్టా. కొత్తగా ఏదైనా కనిపిస్తే ఆగి చూడడం, మళ్లీ ఇంకో వరుసలోని వస్తువులు చూడడం, అలా ఓ జోంబీ లా తిరగడమే. సమయం అట్టే గడిచిపోతుంది. ఫోన్ మ్రోగింది.

మన సుందరమే. రెండిళ్ళ అవతల ఉంటాడు కదా. ఇంత రాత్రి చేస్తున్నాడేం అబ్బా, అదీ నాకు, అనుకున్న. సుందర్ ఆయన భార్య రేవతి ఇద్దరికి ట్రావెల్ ఉద్యోగాలే. మొన్నటి వరకు ఇద్దరూ సీయాటల్ బోయింగ్లో పనిచేసేవారు. ఇప్పుడు రేవతి సాన్ హోసే కు మారింది.

"వనిత గారు, ఇది సుందర్. ఫ్లోరిడా లో మీకు అర్ధ రాత్రి కదండి. సారి అండి. రేపు చేద్దామనుకున్న. రేవతి మీరు మేల్కొనే ఉంటారంది. అందుకేచేస్తున్నాను. ఓ ఫేవర్ కావాలండి. డోరియన్ తుఫాన్ వస్తుందని అమ్మను సీనియర్ కమ్యూనిటీ హోమ్ లో వదిలి వెళ్ళాం. ఇప్పుడు తుఫాన్ మనూరి వైపు రాదని తెలిసి పోయింది. అమ్మ అక్కడుండాల్సిన అవసరం లేదు. మీరు కొంచెం ఆవిడని పిక్ అప్ చేసుకొని మనింట్లో డ్రాప్ చేయగలరా?" సుందర్ గొంతులో కొంత ఆదుర్ధ కూడా వినిపించింది.

సుందర్ వాళ్ళ కుటుంబం చూసి, మనం అలా ఉండాలని ఎన్నిసార్లు అనుకోలేదు. సుందర్, రేవతిలాగా పిల్లల చిన్నప్పటి నుంచే, తల్లి తండ్రులకు కూడా గ్రీన్ కార్డు స్పాన్సర్ చేసి, ఇక్కడికి రప్పించి ఉమ్మడి కుటుంబంలో లాగా కలసి ఉండాలని ఎవరు అనుకోరు? ఆంటీ, అంకుల్ చిన్న పిల్లలను రోజు స్కూల్ బస్ వచ్చేసరికంతా రెడీ చేసి బస్టాప్ లో వదలడం, సాయంత్రం వాళ్ళను ఇంటికి తీసుకెళ్ళడం, సాయంత్రం పూటల వాళ్లని సాకర్ కని, సంగీత, నాట్యాలని కార్లో తిప్పడం అందరూ చూసిందే. సుందర్, రేవతి తమ ట్రావెల్ జాబ్స్ నిరంతరంగా, సంతోషంగా చేసుకోవడానికి, ఆంటీ, అంకుల్ పాత్ర ఎంత ఉందో, పిల్లలు కాలేజీ డార్మ్ లకు వెళ్లే టప్పటికి కానీ తెలియలేదని రేవతి నాకు స్వయంగా చెప్పింది. పిల్లలు ఆంటీ అంకుల్ ను విడవడానికే కన్నీళ్లు నింపుకున్నారట. అలాంటి పిల్లలు ఇప్పుడు ఉద్యోగాల్లో కూడా స్థిరపడిపోయారు. అంకుల్ కూడా పోయి రెండేళ్లు అయ్యిపోయాయి. ఆంటీ ఇప్పుడు సుందర్ వాళ్ళింట్లో ఒంటరిగానే ఉంటుంది. తుఫాన్ అని సీనియర్ హోమ్ లో చేర్చినట్లున్నారు. ఇక సుందర్ ఆంటీ గురించి ఆదుర్తాపడ్తున్నాడంటే, ఆశ్చర్య మేముంది.

"సుందర్ మీరు వర్రీ కాకండి. పొద్దున్నే ఆంటీ ఉండే సీనియర్ కమ్యూనిటీకి హోమ్ కు వెళ్లి , ఆంటిని మీ ఇంట్లో డ్రాప్చేస్తానని" , భరోసా ఇచ్చాను.

ఇవ్వాళ ప్రొద్దునే సుందర్ చెప్పిన సీనియర్ హోమ్ కు వెళ్ళాను. ట్రాఫిక్ పెద్దగా లేదు. ఫోర్ట్ మాయర్స్ పెద్ద ఊరూ కాదు. ఓ అరగంటలోనే చేరిపోయాను. గ్రాండ్ విల్లా. పేరు కు తగట్టు పెద్ద భవనమే. 4 అంతస్తులు, ముందు పెద్ద గార్డెన్, ఫౌంటెన్, తెల్లటి ఎత్తైన స్థంభం పై, నక్షత్రాలు, ఎరుపు తెలుపు గీతలతో రెప రెప లాడుతున్న మన దేశం జెండా. లోపలికి వెళ్ల గానే పెద్ద ఓపెన్ లాబీ కనిపించింది. ఎదురుగా పై అంతస్థులకి పోవడానికి అనుకుంటా, పాత సినిమా సెట్లో లాగా మెట్లు ఉన్నాయి. లాబీలో అక్కడక్కడ సోఫా సెట్లు, పూల మొక్కలు, క్రోటాన్ చెట్లతో అందంగా అమర్చారు.

రిసెప్షన్ కౌంటర్ లో ఉన్న అమ్మాయి వైపు వెళ్లి పరిచయం చేసుకొని, ఆంటీని కలవాలన్నాను. అమ్మాయి ఆంటీకి ఫోన్ చేసి నేను వచ్చినట్లు చెప్పింది. ఆంటీ చెప్పింది విని, ఫోన్ పెట్టేసి, "ఆంటీ రూంలో లేరండి. కాల్ ఆవిడ మొబైల్ కి వెళ్ళింది. ఆవిడ రిక్రియేషన్ హాల్ లో ఉన్నారు. ఎదురుగా ఉన్న మెట్లు ఎక్కితే ముందుగా కనిపించేది ఆ హాలే. మీరు కావాలంటే పక్కనున్న ఈ ఎలివేటర్ కూడా ఉపయోగించుకోవచ్చు", అని చెప్పింది. ఇప్పుడే హై స్కూల్ ముగించి జాబ్ చేస్తున్నటుంది. అమ్మాయి మాటలు, ఉత్సాహం, చూసి మరింత ముచ్చట వేసింది. అమ్మాయికి థాంక్స్ చెప్పి, నేను మెట్లు ఎక్కి రిక్రియేషన్ హాల్ చేరాను.

హాల్లో అక్కడక్కడ సోఫా సెట్లు టేబిల్లు, కుర్చీలు వేసారు. కొందరు పుస్తకాలు, వార్త పత్రికలు చదువుతూ, కొందరు పిచ్చాపాటి మాట్లాడుతూ, కొందరు ఏదో ఆలోచిస్తూ, మరికొందరు బోర్డ్ గేములు ఆడుతూ కనిపించారు. అటు మూల స్క్రాబెల్ ఆడుతూ ఆంటీ కనిపించారు. తాను తల ఎత్తి చూచిన వెంటనే నవ్వి, చేయి ఉపాను. ఆంటీ నవ్వుతూ , "ఏంటమ్మా నువ్విక్కడ?" అన్న పలకరింతతో, నా వైపు అడుగు వేసింది. నేను తన వైపు వడిగా అడుగులు వేస్తూ పోయి కౌగలించుకున్నాను.

"ఎలా ఉన్నారు ఆంటీ. మీ అబ్బాయి సుందర్ పంపించారు. తను ఫోన్ చేస్తే మీరు దొరకలేదంట".

"ఇక్కడ బాగానే ఉందమ్మ. ఇంట్లో ఎవరూ లేనిది, నాకు నేనే మాట్లాడుకోవాల్సి వచ్చేది. ఇక్కడ కావాలిసినంత కంపెనీ. వాడు ఫోన్ చేసి నప్పుడు, ఇదో ఇలా ఎవరితోనో మాట్లాడుతూను, అట్లాడుతూను ఉండి ఉంటాను", అంది ఇంకా చెరగని నవ్వుతూ.

ఆంటీ నవ్వుతే బాగుంటుంది. ఈ మధ్యలో తనని అలా సంతోషంగా చూడలేదు. ముఖంలోను ఏదో కాంతి, కొత్తదనం కనిపిస్తున్నది.

"నా పరిస్థితి అంతే ఆంటీ. ఎందుకు నీలో నీవే గట్టిగా మాట్లాడుకొంటున్నావని, ఆటపట్టిస్తున్నారు. ఏదో మరి, ఎడ తెరపి లేని ఈ ఆలోచనలు అలా నోటి మాట గా వచ్చేస్తున్నాయి. ఇంతకీ నేను వచ్చింది మిమ్మల్ని ఇంటికి తీసుకెల్దామని. సుందర్ డోరియన్ తుఫాను బెడద తప్పిపోయింది కాబట్టి ఇంటికి తీసుకు రామన్నారు", అన్నాను.

"డోరియన్ తుఫాన్ అంటే నాకు హిందీలో దూరియాన్ అని వినిపిస్తుంది, దూరాభారం గుర్తుకొచ్చి మనస్సు బరువై పోతుంది. ఇంగ్లీష్ భాషతో వచ్చిన చిక్కే ఇది. డోరియన్ కు దూరియాన్ కు ఇంగ్లీషులో ఒకటే స్పెల్లింగ్ కదా. ఇల్లు వదిలి ఇక్కడ దూరంగా సీనియర్ హోమ్ పొమ్మంనందుకేమో, డోరియన్, దూరియాన్ లాగా అనిపించింది. కానీ, ఇక్కడ వచ్చిన తరువాత ఈ దూరం, దాని వల్లనిపించిన ఈ, దిగులు ఇట్టే మాయమైపోయాయి. మళ్లీ ఇంటికి వెళ్ళాలా?"

ఆంటీ ముఖంలో కొంత అయిష్టం, మాటలో కొంత దుఃఖం నాకు తెలిసింది. మరీ ఎక్కువ ఆలోచిస్తునా అని అనిపించి,"ఇక్కడ కంటే సొంత ఇల్లు మంచిది కదండి. అదీ కాక, సుందర్ నిన్ననే ఈ సీనియర్ హోమ్ ఆఫీసు వారితో మాట్లాడి అకౌంట్ సరి చేసేసారట. మనం ఇంటికి బయలు దేరాలి. వేరే ఆప్షన్ లేదు", అన్నాను.

ఆంటీ ఓ రెండు నిమిషాలు ఏమి మాట్లాడ లేదు. నేను జవాబు కోసం కొద్దిగా అసహనం గా కదిలాను.

"సరే, ఓ పది నిమిషాలకు ఆగమ్మ. వస్తువులు సర్దుకు వస్తాను", అని ఇది వరకు తను గేము ఆడుతున్న టేబిల్ దగ్గరికి వెళ్లి అక్కడున్నతనితో వీడ్కోలు అనుకుంటా, తీసుకొని పై అంతస్థులో ఉన్న తన రూము కు పోయింది.

ఆ పది నిమిషాల తరువాత ఆంటీవస్తూ వస్తూ మరొకతని కూడా వెంట పట్టుకొచ్చింది. ముఖవలికలు తెల్లవారి లాగా ఉన్నా, చామన ఛాయా రంగు వల్ల, ఎక్కడివాడో పోల్చుకువడం కష్టంగానే ఉంది. ఎక్కడో చూసాననిపించింది. వెంటనే గుర్తు వచ్చింది. ఇందాక ఆంటీ ని ఇక్కడ మొదట చూసినప్పుడు, తన తోనే స్క్రాబుల్ ఆడుతూ కనిపించాడు.

"తను జార్జ్. ఇక్కడే పరిచయమయ్యాడు. ఆయన కూడా ఖాళీచేస్తున్నాడు. దారిలోడ్రాప్ చేయగలవా?", అని ఆంటీఆడిగింది.

జార్జ్ ముఖంలో ప్రసన్నత, చిరు నవ్వు తో నేను ఇట్టే ఒప్పుకోకుండా ఉండ లేక పోయాను. జార్జ్ మంచి కులుపుగోలు మనిషి. వాళ్ళ పూర్వికులు జమైకాలో ఉండేవారట. వాళ్ళు జమైకా కి వలసే వచ్చి ఉంటారు. ఆ దేశంలో డెంటల్ కాలేజీలో చదివి ఈదేశంలో స్థిర పడ్డాడట. భార్య పోయి 5 సంవత్సరాలు అయ్యిందని ప్రస్తుతం రిటైర్ అయ్యి ఎదో టైం పాస్ కని సొంతంగా ఓ షాప్ నడుపుతున్నాడని మాటలలో తెలిసింది.

కారు ట్రంక్ లో వాళ్ళ సూట్ కేసులు పెట్టేసి ఎక్కడికి పోవాలి అని జార్జ్ ని అడిగా. జార్జ్ సానిబెల్ ద్వీపం అని చెప్పాడు. సానిబెల్, ఫోర్ట్ మయిర్స్ పక్కనే ఉంది. ఓ 15 మైళ్ళ డ్రైవ్ నాకు, ఆంటీకి. పెద్ద దూరమేమి కాదు. జీ పీ ఎస్ లో జార్జ్ చెప్పిన అడ్రస్ ఎక్కించి కారు స్టార్ట్ చేసాను.

సానిబెల్ కాస్ వే రాగానే పాస్ ఉంది కాబట్టి, ఆగకుండా టోల్ రోడ్డుఎక్కాను. 3 మైళ్ళు సముద్రం మీద ప్రయాణం.. రెండు పక్కల నీలంగా సముద్రం, దానికి పోటీ పడుతున్నట్లు నీలాకాశం. దూరంగా, ఒకటో రెండు తెల్లటి మబ్బు తునకలు బద్ధకంగా తేలుతున్నాయి. మరో లోకంలోకి పోతున్నట్టనిపించింది.

ఆంటీ, జార్జ్ కబుర్లలో పడిపోయాయారు. దృష్టి రోడ్డు మీదఉండడం వల్ల, వాళ్ళ మాటలు వింటూ అప్పుడప్పుడు నేనూ వాళ్ళతో మాట్లాడుతూ ఉన్నాను. ఆంటీఇంతకు ముందు వారు ఆటలో ఉపయోగించిన పదాలగురించి వాదిస్తున్నది. జార్జ్ అలాంటి పదం లేదనడంతో, తాను చదివిన పుస్తకంలో ఓ వాక్యం, దాని సందర్భం చెప్పి జార్జ్ కి వివరించింది. ఆంటీ ఒకప్పుడు సైన్స్ టీచర్ గా పనిచేసినట్లు విన్నాను. కానీ ఇంగ్లీష్ సాహిత్యం మీద కూడా తనకు పట్టు ఉందని ఈ ప్రయాణంలో తీసింది. అలా, అలా వారిద్దరూ ఓ విషయం నుంచి మరో విషయం కు అనాయాసంగా ప్రయాణం చేయడం, వింటున్న నాకే ముచ్చట వేసింది.

కాస్ వే దిగగానే సానిబెల్ ద్వీపం. మొత్తం ద్వీపం పొడవు 15 మైళ్ళు వెడల్పు 5 మైళ్ళు. స్పీడ్ లిమిట్ 35 మైళ్ళు. కారును నిదానంగా నడపడంతో మనస్సు ఒక్కింత రిలాక్స్ అయ్యినట్లనిపించింది, 70 మైళ్ళ స్పీడ్ తో నడుపుతున్నప్పుడు అలికినట్లు, మసక, మసక గా కనిపించే రోడ్డు పక్కన ఈత జాతి పామ్ చెట్లు, వీటి మధ్యలో పూల మొక్కలు, రకరకాల నీటి పక్షులు...మంచి ఫోకస్ లోకి వచ్చి చక్కగా కనిపిస్తున్నాయి. కార్లు కూడా ఎక్కువ లేవు. ద్వీపంలో చాలా మటుకు టూరిస్ట్ లకని రిసార్ట్లు, రెస్టారెంట్ లు, వారు తీరికగా తిరగడాని సైకిళ్ళు ఉన్నాయి. తూఫాన్ భయంతో ఎక్కవ జనం లేరు. ప్రపంచం ఆగి సేద తీర్చుకున్నట్లు ఉంది.

జార్జ్ చెప్పిన అడ్రస్ జి పి ఎస్ లో ఓ ఆరు మైళ్ళ తరువాత ద్వీపం చివర్లో ఉంది. దారిలో షెల్ మ్యూజియం కనిపించింది. కొత్తగా మార్పులు చెయ్యడానికి మూసివేసినట్లు నోటీస్ పెట్టారు. దాన్ని చూసి జార్జ్ , నా దగ్గర కూడా మంచి గవ్వల కలెక్షన్ ఉంది. చూపిస్తాను లెండి అన్నాడు. మీకు తెలిసిందే కదా సానిబెల్ గవ్వల రాజధాని. ద్వీపం చుట్టూ ఉన్న తీరాల వెంబడి ఎప్పుడు గవ్వలు వెతుక్కుంటున్న టూరిస్ట్ లని చూడొచ్చు. పొద్దున సూర్యోదయానికి ముందు ఈ జనాలు మరీ ఎక్కువ.

మాటల్లోనే జార్జ్ చెప్పిన అడ్రస్ కు వచ్చేసాం. అది ఓ గవ్వల క్యూరియో షాప్.

"ఇల్లెక్కడ? షాప్ లాగా ఉంది", జార్జ్ ని చూసి అడిగా.

"ఇది నా షాపే. ఇల్లు ఈ షాపు వెనకాల ఉంది".

"ఆలాగా", అని జార్జ్ తన బ్యాగ్ తీసుకోవడాని, ట్రంక్ బటన్ నొక్కి తెరిచాను.

"మీరూ దిగండి. ఇందాక అన్నట్లు మీకు నా దగ్గరున్న గవ్వల కలెక్షన్ చూపిస్తాను. మీకు తప్పకుండా నచ్చుతుంది".

ఆంటీ అప్పటికే దిగేసి జార్జి పక్కన నుంచుంది. ఇక గత్యంతరం లేక నేనూ కార్ పార్క్ చేసి దిగాను.

జార్జి కొట్టు తెరిచి మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు. ఓ నగల దుకాణం లాగా ఉంది. గోడ పైన, గది చుట్టూ బల్లల పైన గాజు కౌంటర్లు, వాటిలో అందంగా అమర్చిన గవ్వలు, గవ్వలతో చేసిన రకరకాల బొమ్మలు, నగలు. గవ్వలు ఇన్ని రంగులలో ఉంటాయని తెలీదు. జార్జి తాను ఎలా జీవితాంతం బీచి పక్కన ఊళ్ళోనే గడిపింది, ఎలా ఈ గవ్వల సేకరణ హాబీగా మారింది, ఆ గవ్వలలో ఉన్న తేడాలు, అవి గుర్తు పెట్టడం ఎలా, అని చమత్కారంగా వివరిస్తూ ఉంటే, సమయం ఇట్టే గడిచిపోయింది. ఆంటీ కూడా ఇంత ఓపికగా , ఎంతోఆశక్తి తో జార్జ్ మాటలు వింటుంటే ఆశ్చర్యమేసింది.

ఇక సమయం అయ్యిందని జార్జ్ దగ్గర సెలవు తీసుకో ప్రయత్నిస్తే, ఆగండి అని ఈ ఫ్లోరిడా రాష్ట్ర చిహ్నం గుర్తుగా తీసుకోమని ఫ్లోరిడా గుబ్బం శంఖం తానే ఒకటి తీసి ప్యాక్ చేసి నాకిచ్చాడు. ఆంటీకి ఎందుకివ్వ లేదనుకున్నాను. అప్పటికే తీసిఉంచిన ట్రంక్ నుంచి జార్జి సూట్ కేస్ తీయబోతుంటే, తనే వచ్చి సూట్ కేసు అందుకున్నాడు. అలానే ఆంటీ సూట్ కేస్ కూడా దింపేస్తే,

"అయ్యో జార్జ్ గారు అది ఆంటీ సూట్ కేస్ అండి. ఉంచేయండి. ఆంటీని డ్రాప్ చేసినప్పుడు, ఆవిడ సూట్ కేస్ కూడా వాళ్ళ ఇంట్లో పెట్టేస్తాను", అన్నాను.

"ఇట్స్ ఓకే అమ్మా. నేనిక్కడే డ్రాప్ అయ్యిపోతాను",అంది ఆంటీ.

నా ముఖంలో షాక్ చూసి, తిరిగి ఆవిడ నవ్వుతూ, నా దగ్గరికి వచ్చి నన్ను దగ్గర తీసుకొని, భుజం వత్తుతూ "జార్జ్ కి ఈషాప్ నడపడంలో సహాయం కావాలన్నాడు. నాకు కావలసినంత తీరిక ఉంది కదా. సరే అన్నాను. తన ఇంట్లోనే ఉండే వసతి కలిపిస్తానన్నాడు. సో ఐ ఆమ్ సెట్", అంది ఆంటీ.

ఈ కాలం పిల్లల లాగా, ఇలా ఆంటీ ఇంకొకరి ఇంటికి మూవ్ అవ్వడం షాకే. తెరుకోవడానికి నాకే సమయం పడే టట్లుంది. ఇంక ఆంటీ వాళ్ళబ్బాయి కి ఏమని జవాబు చెప్పాలి.

అదే మాట, ఆంటీ తోను చెప్పాను. ఆంటీ అదేనవ్వుతో "పిల్లలిద్దరూ కాలేజీకి వెళ్లిపోయారు. వాళ్ళ చిన్నప్పుడు, నేను ఇంట్లో ఉండడం అబ్బాయికి, కోడలికి సౌకర్యంగా ఉండేది, అదీ వారు ట్రావెల్ జాబులు చేసుకొని మరింత సంపాదించడానికి. ఇప్పుడు పిల్లలు ఇంట్లో లేరు. ఒంటరిగా ఉన్న నేను, ఇలాంటితుఫాను సమయాలలో వాళ్లకి సమస్యనే. ఇదో నీ లాంటి వారిమీద ఆధార పడవలసి వస్తుంది. నేనీలా ఇంటి నుంచి వెళ్లిపోయానని, బయట వారికి చెప్పడానికి వాళ్ళు ఇబ్బంది పడతారేమో. కానీ సమయమే అన్నీ సమస్యలకు పరిష్కారం. మొన్నీమధ్యే మనమరాలు బాయ్ ఫ్రెండ్ తో మూవ్ అయ్యింది అంటే అబ్బాయి, కోడలు పెద్దరిలీఫ్ తో తెగ సంతోష పడలేదు. నేను అలానే మూవ్ అయ్యాననుకొని, అర్థం చేసుకుని కొన్ని రోజుల తరువాత గొప్ప రిలీఫ్ తో సంతోష పడతారు లే. అయినా నేను అప్పుడప్పుడు వీకెండ్స్ కో, థాంక్స్ గివింగ్ కో కలుస్తూనే ఉంటాలే", సముదాయించింది.

మళ్లీ నా  ముఖం లో ఇబ్బంది చూసిందేమో.

"నీవింటికి వెళ్ళమ్మ. నేనే మా వాడికి ఫోన్ చేసి చెప్తాను",అంటూ హగచేసుకొని వీడ్కోలు చెప్పింది.

విన్నారా...ఆంటీ ఆ సీనియర్ హోమ్లో కలిసినాయన తో మూవ్ అయ్యి పోయింది. హే మీకే చెప్పేది, నాగొంతు పెంచా.

తల తిప్పి చూసాను. ఫోన్ వాట్స్ ఆప్, ఫేస్ బుక్ లోకాల్లో  మునిగిపోయిన మా వారు, తలెత్తి " ఆ..ఆ..మిస్ అయ్యా...మరో సారి చెప్పు",  అన్నాడు.

ఇద్దరం టివి ముందు ఓ అరగంట క్రితం కూల బడ్డాం. టీవీలో సి ఎన్ ఎన్ న్యూస్ వస్తూనే ఉంది. టివి మ్యూట్ చేసి క్లోజ్ కాప్షన్ ఎప్పటిలాగే పెట్టి,  కథ మోదలెట్టా. ఇప్పుడు మళ్లీ మొదలెట్టాల?

ఎదురుగా టేబిల్ పైన నా కోసం చేసుకొని కొంచెం రుచిచూసి వదిలిన మోహితో గ్లాస్ ఉంది. ఫ్లోరిడా వచ్చిన తరువాత మోహితో ఇష్టమైపోయింది. నేనే ఈ కాక్టెయిల్ చేసుకున్నా. తెల్ల రమ్ లో,  చక్కెర, నిమ్మ కాయ కోసి దాని రసం , సోడా కలిపాను. పుదీనా ఆకులతో పాటు, మా అత్తగారు పోయిన సారి వచ్చినప్పుడు పెరట్లో వేయించిన తులసి చెట్టునుంచి ఆకులు కోసి పైన చల్లాను. తులసి ఆకులు, మాకూ మోహితో కు, సంబంధం లేదన్నట్లు పైన తేలుతున్నాయి. తులసి ఆకుల పైన అంటీ అంటనట్టు మోహితో చుక్కలు స్థితప్రజ్ఞులు లాగా మెరుస్తున్నాయి.

చేయి చాచి, గ్లాస్ అందుకొని మొత్తం  మోహితో ని, ఓ గుక్కలో తాగేసా.